# 11

# క్రీస్తు యొక్క పెండ్లికుమార్తె

"... ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి, అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని ..." (2 కొరింథీ. 11:2).

"దేవుడు పురుషుని ముందుగా ఎందుకు చేశాడో నీకు తెలుసా? తన సంపూర్ణ సామర్థ్యాన్ని తెలిపే చిత్తరువు వేయకముందు ఆయన మోటైన ఒక చిత్తు తయారీని చేశాడు!" అని హార్డింగ్ యూనివర్సిటీ విద్యార్థులు సరదాగా అంటారు. సరదాలన్నీ ప్రక్కనపెట్టి, దేవుని నమూనా ప్రకారం స్త్రీ, అందమైన జీవి - దేవుని సృష్టి యావత్తులో అత్యంత రమ్యమైనది.

తన వివాహ దినమునకంటె స్త్రీ మరెన్నడు అంత అందంగా అలంకరింపబడదు. వారి వైవాహిక మహోత్సవంలో, తన హృదయాన్ని, తన జీవితాన్ని అతనికి సమర్పింప వచ్చిన ఆమెయొక్క ప్రకాశించునట్టి సౌందర్యాన్ని ఏ భర్త మరచిపోగలడు? ముసలితనం ఆ జ్ఞాపకాలను ముసుగువేసి గాని, మరణం అతని పిలుచుకొని వెళ్లేవరకు గాని, ఆ గడియలలోని ఆమె సొగసు అతని మనస్సులో ముద్రింపబడి నిలిచియుంటుంది.

సంఘంయొక్క ఏ యితర రూప చిత్రంకూడ, "పెండ్లికుమార్తె" అనే పదం తెచ్చినంతటి ఉద్వేగము, దయ మన మనస్సులోనుండి బయటికి తేదేమో. సంఘము కొరకున్న క్రొత్త నిబంధన రూప చిత్రాలన్నిటిలో దీనిని ఒకవేళ అత్యంత శృంగారమైన స్థితిలో నిలుప వచ్చునేమో.

సంఘముయొక్క వర్ణనగా ఈ పదాన్ని ఉపయోగించినవాడు యోహాను మాత్రమే. ఈ పదాన్ని ఉపయోగించడంలో, భూలోక, పరలోక సంబంధమైన సంఘముయొక్క స్థితులను అతడు ఒకదానితోనొకటి మిళితం చేశాడు (ప్రకటన 21:2, 9; 22:17). ఏదియెలాగున్నా, మార్కు 2:19లో ప్రభువైన యేసు, 2 కొరింథీ. 11:2లో పౌలు సంఘాన్ని పెండ్లి కుమార్తెగా సూచించారు. అలాటి యితర సూచనలలో, ఎఫెసీ. 5:22-23లో పౌలు చూపిన పోలిక, రోమా 7:1-4లో అతని సాదృశ్యము, యిందులో చేర్చబడతాయి.

సంఘాన్ని క్రీస్తు ప్రభువుయొక్క పెండ్లి కుమార్తెగా ఆలోచించడం అనేది, సంఘం యొక్క స్వభావం, మరియు గుణగణాలలో మరొక దృష్టిని మనకు తెస్తుంది. సంఘం ఏ విధంగా ఉండాలని ఉద్దేశింపబడిందో సంపూర్ణంగా గ్రహించుకొనడానికి గాను, దాన్ని వర్ణించడానికి పరిశుద్ధాత్మ వినియోగించిన పదాలను, రూపాలను, చిత్రాలన్నిటిని మనం తూచి చూడవలసియుంటుంది.

సంఘానికి దాన్ని వర్తింపజేసినప్పుడు పెండ్లి కుమార్తె అనే రూప చిత్రం ఏమి తెలియజేస్తుంది?

## ప్రశ్నింపబడని ప్రభు భక్తి

మొదటిగా, "పెండ్లికుమార్తె" అనే పదం విశ్వాసాన్ని తెలియజేస్తుంది. పెండ్లి కుమార్తె ఒక సమర్పణను చేసికొంది; ప్రేమ, నమ్మకత్వానికి, జీవితానికి అవసరమైన ఒక నిబంధనలో ఆమె ప్రవేశించింది.

నిజమైన క్రీస్తునుండి అబద్ధపు యేసు, మరియు అసత్య సువార్త వైపుకు కొరింథీయులు తిరిగి పోతున్నట్టు పౌలు భయపడ్డాడు. తత్ఫలితంగా, కొరింథీయులు స్థిరంగాను, పవిత్రంగాను నిలిచియుండేలా అర్థించడానికి వాడదగినంత బలీయమైన భాషను అతడు ఉపయోగించాడు: "దేవాసక్తితో మీ యెడల ఆసక్తి కలిగి యున్నాను; ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి, అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని" (2 కొరింథీ. 11:2). పెండ్లికుమార్తె తన భర్తకు ద్రోహం చేయడం ఆలోచించకూడనిది, గనుక, క్రైస్తవునికి క్రీస్తుపట్ల ఉండవలసిన నమ్మకాన్ని సూచించ డానికి పౌలు ప్రధానం చేయడమనే సంబంధాన్ని ఉదహరించాడు.

భార్య భర్తల ఏకీభావముకంటె మిన్నగా ఉండే బాంధవ్యం ఏముంటుంది? వారు విడిపోయేదానికంటె ఏకంగా కలిసి చనిపోవడానికి (తీర్మానించుకున్న) కోరుకున్న భార్యభర్తలను గూర్చి మనలో ఎక్కువమంది వినే ఉంటారు. వారిరువురి హృదయాలకు ఒకరిపట్ల మరియొకరికున్న (డివోషన్) సమర్పణ బ్రతుకుకంటె మిన్నయైనది.

సంఘానికి కావలసిన ఒకే ఆవశ్యకత క్రీస్తుపట్ల నమ్మకం. ఆయన ప్రజలకు అనుచరులు లేక వెంటవచ్చువారు అవసరం లేదు, ఆస్తిపరులు కానవసరం లేదు, కనీసం బ్రదుకనవసరం కూడా లేదు – వారు కేవలం క్రీస్తుకు నమ్మకస్థులైయుంటే చాలు (ప్రకటన 2:10). ఆయన కొరకైన మన సమర్పణను ఏ బాంధవ్యంకంటెను (లూకా 14:26), సొత్తుకంటెను (లూకా 14:33), లేక సంబంధముకంటెను (లూకా 14:27) అధికంగా దానికి విలువకట్టాలి.

## సాటిలేని గుర్తింపు

రెండవది, సంఘము క్రీస్తుయొక్క పెండ్లికుమార్తె అనేదానిలో గుర్తింపు గుప్తమైయుంది. మనం జనుల సముదాయమైయుండి, మన ప్రేమలను ఇరికించుకొంటూ ఒకే ప్రేమకు వచ్చి చేరుకున్నాం, ఈ మానసిక ఏకాగ్రతతోనే క్రీస్తుతో మనం నిబంధన చేసికొన్నాం. గనుక, భార్య భర్తలు ఒకరికొకరు చెందియున్నట్టు, మనము క్రీస్తువారము, క్రీస్తు మనవారు. మనం క్రీస్తును శిరస్సుగా చూస్తాం; మనం ఆయన నామాన్ని ధరిస్తాం, ఆయన మనలను భూమిమీద తన శరీరంగా తీసికొంటాడు, మనలను తన సంఘమని ఆయన పిలుచు కుంటాడు.

వివాహమంటే అటు భార్యకు యిటు భర్తకు కూడా గుర్తింపు ఉంటుంది, కాని అది ప్రత్యేకించి పెండ్లికుమార్తె విషయంలో సత్యమౌతుంది. ఎందుకంటే, జీవితాంతంవరకు ఉండే వివాహపు బాంధవ్యంలో ఆమె ప్రవేశిస్తుండగా ఆమె క్రొత్త పేరును, అంటే ఆమె తన భర్త పేరును ధరించుకొంటుంది. ఆలాగే, మనం సంఘంలో ప్రవేశించి, "క్రీస్తు

సంఘములో" భాగమైనప్పుడు (రోమా 16:16), క్రీస్తుతో ఏకీభావంవలన కలిగిన నూతన పోలికలో మనం ప్రవేశిస్తాం.

దేవుడు వివాహాన్ని ఎలా ఏర్పాటు చేశాడంటే, భార్య భర్తలు ఏకమయ్యేలా చేశాడు: "కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు" (ఆది. 2:24). అలాగే మార్పు పొందడంలో కూడ, మనం క్రీస్తుతో ఏకమైయుంటాం (రోమా 6:3). ఈ ఏకత్వం ఎంత లోతైనదంటే, వివాహ బంధమందు భార్య భర్తలు అనుభవించే ఏకత్వంవంటిది: "అటువలెనే పురుషులు కూడ తమ సొంతశరీరముల వలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు … మనము క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము. … గనుక ఆలాగే క్రీస్తుకూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు" (ఎఫెసీ. 5:28-30).

ఒక వ్యక్తి చేసికొనే ప్రధానమైన ఒప్పందాలలో, క్రైస్తవుడయ్యే దాని తరువాత, వివాహమే అన్నిటికంటె ముందటిది కావచ్చు. వివాహ బంధం అసాధారణంగా ఎంత ప్రాముఖ్యమైనదంటే, అందులో ప్రవేశించే ఎవరైనా వ్యత్యాసమైన వ్యక్తిగా మారిపోవాలి. వివాహానికి ముందు తాను ఒక్కడు, కాని వివాహానంతరం అతడు యిద్దరు; వివాహానికి ముందు తనకు తానే; వివాహానంతరం అతడు మరొకనికి చెందుతాడు. అదే విధంగా, క్రొత్త నిబంధన సంఘంలో మనం ప్రవేశిస్తుండగా, మనం క్రీస్తుయొక్క శరీరమయ్యాం. గతంలో మనం ఏమైయుంటిమో యికను మనం అది కాదు; మనం క్రైస్తవులమయ్యాం, క్రీస్తుతో మనకున్న ఏకత్వంవలన గుర్తింపబడే వ్యక్తులమయ్యాం.

## అధిగమించలేని బాంధవ్యం

మూడవది, పెండ్లికుమార్తె పెండ్లికుమారునితో ప్రత్యేకమైన కొనసాగింపబడే ఒప్పందాన్ని కలిగియుంటుంది. పెండ్లికుమారుడు పెండ్లికుమార్తె అనే తెగలో భూమిమీద నున్న యిక ఏ బాంధవ్యము పడదు.

ఎఫెసీ. 5:22-23లో సంఘము క్రీస్తుతో కలిగియున్న బాంధవ్యాన్ని, దానికి సమాంతరంగా ఉన్న భార్య భర్తల బాంధవ్యంతో పౌలు వివరిస్తున్నాడు. క్రైస్తవ వివాహమందు దేవుడు భార్య భర్తలకు నియమించిన పాత్రలను అతని ఉదాహరణ వివరిస్తుంది; అయితే అతని ప్రాథమిక దృష్టి క్రీస్తు మరియు ఆయన సంఘము మధ్యనున్న సంబంధమే (ఎఫెసీ. 5:32).

ఈ పోలికలో, లోబడియుండడాన్ని పౌలు దైవప్రేరేపణవలన నొక్కి చెప్పాడు. క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెగా, సంఘము తనకు శిరస్సైయున్న క్రీస్తు ప్రభువుకు లోబడియుంటుంది. అతడిలా అన్నాడు, "స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ. 5:22, 23). భార్య తన భర్తకు లోబడినట్టుగా, సంఘము తన నాయకుడుగా క్రీస్తువైపు చూస్తుంది.

"నియంత పరిపూర్ణుడైతే, పరిపూర్ణమైన ప్రభుత్వం నియంతదే"నని ఒకడన్నాడు.

సంఘము పరిపూర్ణుడగు క్రీస్తుకు లోబడి, పరిపూర్ణమైన నాయకత్వాన్ని అనుభవిస్తుంది. సంఘము ఏ మనిషివైపు చూడదు, ఏ మానవ గుంపువైపుకు చూడదు, దాని అధికారం కొరకు భూమిమీద ఏ కేంద్ర స్థానం వైపుకు చూడదు. నిజమైన క్రీస్తు సంఘానికి ఒకే ఒక శిరస్సు, క్రీస్తు ప్రభువు.

బైబిలు క్లాసులో నేనెప్పుడైనా ఎఫెసీ. 5:22-23ను చర్చించానంటే, 23వ వచనం భర్తకు కాదు భార్యకు చెందుతుందని, మరియు 25వ వచనం భార్యకు కాదు భర్తకు చెందుతుందని చెప్తూతూ ఉంటాను. భార్యకు చెప్పబడినమాట "లోబడియుండడం," భర్తకు చెప్పబడిన పదం "త్యాగం." పౌలు ప్రకారం, మంచి భర్తకు కనీసం రెండు లక్షణాలుంటాయి: (1) క్రీస్తు సంఘాన్ని ప్రేమించినట్టు భర్త తన భార్యను త్యాగ పూరితంగా ప్రేమిస్తాడు, మరియు (2) ఆమెకు అత్యున్నతమైన ఆత్మసంబంధమైన నాయకత్వాన్ని అనుగ్రహించుతాడు. అలాగే, పౌలు ప్రకారం, మంచి భార్య కూడా కనీసం రెండు గుణగణాలను కలిగియుంటుంది: (1) తన శిరస్సుగా, ఆమె తన భర్తకు తన్ను తాను లోబరచుకొంటుంది, మరియు (2) సంఘం క్రీస్తు ప్రభువును ప్రేమించవలసిన విధంగా ఆమె అతని ప్రేమిస్తుంది.

సంఘంలో ప్రవేశించి, అందులో నిలిచియుండకుండ ఎవరును క్రీస్తుతో పెండ్లి కుమార్తె/పెండ్లికుమారుడనే ప్రత్యేకమైన బాంధవ్యాన్ని కలిగి యుండలేరు. ఒక మనుష్యుని భార్యకంటె, మరి ఏ యితర స్త్రీకి అదేరకమైన ఆధిక్యతలు అనుగ్రహింపబడనట్టే, ఏ యితర సంస్థగాని, నిర్వాహకము గాని - ఎంత పేరుగలదైనా లేక సేవచేయడానికి ఎంతగా సమర్పింపబడినదైనా, - క్రీస్తుతో పెండ్లికుమార్తె/పెండ్లికుమారుడు అనే బాంధవ్యం యివ్వబడదు.

## అపరిమితమైన ఏర్పాట్లు

నాల్గవది, క్రీస్తుయొక్క పెండ్లి కుమార్తెయంటే, క్రీస్తుయొక్క జాగ్రత్త మరియు ప్రేమ ఏర్పాట్లు కలిగి యుండడమని అర్థం. రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునునైన ఆయన పెండ్లి కుమార్తెకు వచ్చే దీవెనలను సంపూర్ణంగా గ్రహించగలవాడెవడు?

ప్రభువైన యేసు తన సంఘానికి రక్షణను ప్రసాదిస్తాడు. "క్రీస్తు శరీరమునకు రక్షకుడై యున్నాడని" పౌలు సూచించాడు (ఎఫెసీ. 5:23). తన ప్రాణాన్ని దానికొరకు పెట్టడంవలన ఆయన తన సంఘానికి జీవాన్ని తెచ్చాడు, "అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, దానికొరకు ఆయన తన్ను తాను అర్పించుకొనెను" (ఎఫెసీ. 5:25). పైగా, క్రీస్తు సంఘమును సంరక్షిస్తున్నాడు. క్రీస్తు సంఘమును పోషించి సంరక్షించుకొనినట్టే భర్త భార్యకు చేయవలసియుందని పౌలు తెలిపాడు (ఎఫెసీ. 5:29). సంఘముయొక్క పవిత్రతను కాపాడి, దాని భవిష్యత్తును భద్రపరచుతున్నాడు. "అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలవబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదక స్నానముచేత

దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ. 5:26, 27).

---

పెండ్లి కుమార్తె భర్తయొక్క జాగరూకత క్రిందికి
వచ్చినట్టే క్రీస్తు శరీరములోనికి
ప్రవేశము క్రీస్తుయొక్క జాగరూకత మరియు
ఏర్పాట్లలోనికి మనలను తెస్తుంది.

---

పిల్లలు (మరియు వయోజనుడు) సిన్‌డ్రెల్లా యొక్క రమ్యమైన కథను ఎంజాయ్ చేస్తారు. హీనంగా చూడబడిన బానిసపిల్ల కడకు రాజకుమారుని పెండ్లాడగలిగిందనే భావనచే మనం ముగ్ధులం చేయబడతాం. ఆ కథయొక్క ముగింపును దాటి దాన్ని కొనిపోదాం. "మిగిలిన కథ ఏమి?" రాజకుమారుని భార్యగా సిన్‌డ్రెల్లా జీవితం ఎలాగుంది? జీవితం ఆమెకు ఎంత వ్యత్యాసంగా ఉందో! గతంలో పేదరికానికి, బానిసపనికి, నిందకు, నిరాశకు గురియైన ఆమె ఆడంబరం, ధనం, సహాయం, తన నూతన జీవితంలో గృహంలో మహిమాయుక్తమైన భవిష్యత్తును అనుభవిస్తుంది. రాజకుమారునితో ఆమె వివాహము నూతన హోదా, నూతన జీవితం, లెక్కలేనన్ని సుఖసంతోషాలు తెచ్చాయి.

పెండ్లికుమార్తె భర్తయొక్క జాగరూకత క్రిందికి వచ్చినట్టే, క్రీస్తు శరీరములోనికి ప్రవేశం క్రీస్తుయొక్క జాగరూకత మరియు ఏర్పాట్లలోనికి మనలను తెస్తుంది. సంఘం మాత్రమే క్రీస్తు భద్రతలో ఉంచబడే వాగ్దానం కలిగియుంది.

## అసమానమైన వాగ్దానం

అయిదవది, క్రీస్తు ప్రభువు అనుభవించే భవిష్యత్తునే క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెయైన సంఘం కూడా అనుభవించనైయుంది. క్రీస్తు ఎక్కడికి వెళ్లతాడో సంఘం అక్కడికి వెళ్లనైయుంది, క్రీస్తు పొందేది పొందనైయుంది, క్రీస్తుతో నిత్యత్వంలో నివసింపనైయుంది.

క్రొత్త నిబంధనలో సంఘానికి సంబంధించి "పెండ్లికుమార్తె" అనే పదం ప్రకటన 21, 22ల్లో కన్పిస్తుంది. సంఘంయొక్క స్వభావంతో దాని నిత్య గమ్యాన్ని కలపడానికి యోహాను ఈ పదాన్ని ఉపయోగించాడు. అతడు తొలిగా, "నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట" చూచాడు (ప్రకటన 21:2). తరువాత, "–ఇటు రమ్ము, పెండ్లికుమార్తెను, అనగా గొఱ్ఱెపిల్లయొక్క భార్యను నీకు చూపెదనని" యోహాను దూతచే చెప్పబడ్డాడు (ప్రకటన 21:9). అప్పుడతడు యెత్తయిన గొప్ప పర్వతము మీదికి ఆత్మయందు కొనిపోబడినవాడై, "యెరూషలేము అను పరిశుద్ధ పట్టణము దేవుని మహిమగలదై పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట" చూపబడ్డాడు (ప్రకటన 21:10, 11). ఆత్మ యొక్కయు పెండ్లికుమార్తె యొక్కయు

ఆహ్వానంతో ప్రకటన ముగించబడుతుంది: "ఆత్మయు పెండ్లికుమార్తెయు 'రమ్ము' అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనిన వానిని రానిమ్ము; ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" (ప్రకటన 22:17).

ఆత్మయొక్క సందేశాన్నిబట్టి, భూసంబంధమైన స్థితిలో సంఘం క్రీస్తునకు నిశ్చయింపబడిన భార్యయు, పరలోక సంబంధమైన స్థితిలో క్రీస్తుకు భార్యయు అయ్యుంటుంది. 2 కొరింథీ. 11:2లోని పౌలుయొక్క హెచ్చరిక దీనికి సరిపోతుంది: "దేవాసక్తితో మీ యెడల ఆసక్తి కలిగి యున్నాను; ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి, అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని."

ప్రధానంయొక్క నెరవేర్పు వాస్తవమైన వివాహం. నూతన యెరూషలేమను పరిశుద్ధ పట్టణము తన భర్తకై అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె పరలోకంనుండి దిగి వచ్చుట యోహాను చూచాడు; మరియు ప్రధానం చేయబడిన స్థితినుండి వివాహానికి సంఘం జరిగిపోతున్నట్టు అతడు ఆ దర్శనాన్ని వ్యాఖ్యానించాడు. "పెండ్లికుమార్తె" అనే పదంతో సాదృశ్యంగా చెప్పబడిన సంఘంయొక్క స్వభావం, గొర్రెపిల్ల భార్యగా పరలోకంనుండి దిగి వచ్చినదిగా చిత్రింపబడిన రూపంలో, సంఘం యొక్క భవిష్యత్తుతో మిశ్రం చేయబడింది.

ప్రభువైన యేసు తన శరీరమైన సంఘాన్ని రక్షించు వాగ్దానం చేశాడు (ఎఫెసీ. 5:23), యింకా ఏ యితర సంస్థను కాదు. ముందుగా చేయబడిన వాగ్దానం నెరవేర్చబడి, దుష్టునిపై విజయం పొందే భాషలో సంఘంయొక్క భవిష్యత్తు ప్రకటనలో చిత్రింపబడింది. ఆ నిత్యమైన పట్టణాన్ని నీవు వెదకగోరితే, తన సంఘములో క్రీస్తునకు నమ్మకంగా ఉండునట్లు లేఖనాలు నిన్ను నడిపిస్తాయి.

## నిష్కళంకమైన సౌందర్యం

ఆరవది, "పెండ్లికుమార్తె" అనే పదం సౌందర్యాన్ని సూచిస్తుంది. పెండ్లికుమార్తెను మించిన సొగసైనదేదీ ఉండదు. ఆమె సౌందర్యము, అలంకరణ సుప్రసిద్ధమయినవే.

యోహాను యిలా వ్రాశాడు, "మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని" (ప్రకటన 21:2). దేవుడైన యెహోవా యొక్క దీవెనలను గూర్చి వ్రాస్తూ, పెండ్లికుమార్తెయొక్క ఆకర్షణను ఉదాహరణగా ఉపయోగించాడు: "... ఆభరణములతో అలంకరించుకొనిన పెండ్లికుమార్తె రీతిగాను ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింపజేసియున్నాడు నీతి అను పైబట్టను నాకు ధరింపజేసియున్నాడు. కాగా యెహోవానుబట్టి మహానందముతో నేను ఆనందించు చున్నాను నా దేవునిబట్టి నా ఆత్మ ఉల్లసించుచున్నది" (యెషయా 61:10). పైగా, దేవుని ప్రజలయొక్క విశ్వాస్యతను పెండ్లికుమార్తె యొక్క కాంతి అతడు యిలా పోల్చాడు: "... పెండ్లికుమారుడు పెండ్లికూతురుని చూచి సంతోషించునట్లు నీ దేవుడు నిన్ను గూర్చి సంతోషించును" (యెషయా 62:5).

అమెరికాలో అనేకమంది దంపతుల మధ్య గౌరవింపబడే ఆచారం వివాహపు వస్త్రాలు పెండ్లికుమార్తె వేసికొని వివాహానికి నడిచివచ్చేవరకు పెండ్లికుమారుడు వాటిని చూడకుండడం. ఈ ఆచారాన్ని వెంటాడడంలో పెండ్లికుమార్తె నిజంగా "తన భర్తకొరకు అలంకరింపబడినదై" ఉంటుంది. పెండ్లికుమారుడు ఆమెను తొలిగా చూచినప్పుడు, ఆమె సౌందర్యం చెప్పశక్యం కానట్టు అతడు కనుగొంటాడు.

క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయైన సంఘం నీతి వస్త్రములచేతను పరిశుద్ధతయనే వివాహపు వస్త్రములచేతను అలంకరింపబడింది. పౌలు యిలా వ్రాశాడు, "అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తనయెదుట దానిని నిలువబెట్టు కొనవలెనని" (ఎఫెసీ. 5:27).

సంఘము క్రీస్తుకు సౌందర్యమైనదిగా కనబడినట్టయితే, అది లోకానికి కూడా సౌందర్యంగానే కన్పిస్తుంది. అది క్లిచే (Cliche) వంటిది. "నీ శీలాన్ని కాపాడుకో, నీ శీలం నీ గౌరవాన్ని కాపాడుతుంది." క్రీస్తు వాక్యమునుబట్టి సంఘం పవిత్రంగా ఉండగా, అది క్రీస్తుకు సౌందర్యంగా ఉంటుంది, లోకంలో దాని ప్రఖ్యాతి ఉండవలసిన రీతిగా ఉంటుంది.

వాక్యమందు నిలిచియుండడంవలన, క్రీస్తుకు నమ్మకత్వంగా ఉండడంవలన, పరలోకంలో వివాహంకొరకు సంఘం సిద్ధంగా ఉంటుంది. దేవునియెదుట నిష్కళంకమైన శీలం, నిందారహితమైన తత్వాన్ని నిలుపుకొనడాన్ని బట్టి, ఆ ప్రత్యేకమైన దినంకొరకు మనలను మనమే కాపాడుకుంటాం.

## ముగింపు

పెండ్లికుమార్తె తన భర్తకొరకు అలంకరించుకొనే దానికంటె సొగసైనది మరే ముంటుంది? సౌందర్యము, పవిత్రత, నిలకడగా ఉన్న నమ్మకత్వము "పెండ్లికుమార్తె" మాటలో వ్యక్తపరచబడింది. సంఘంయొక్క స్వభావాన్ని వ్యక్తపరచడానికి పరిశుద్ధాత్మ ఈ పోలికను ఎందుకు ఎన్నుకున్నాడో చూడడం సులభం. ఈ పదంలో, సంఘము క్రీస్తుతో కలిగియుండే వింతైన బాంధవ్యాన్ని, సంఘము క్రీస్తుకు నమ్మకంగా ఉండడాన్ని, సంఘానికి క్రీస్తు చేసిన ఏర్పాట్లను, సంఘానికి క్రీస్తు ప్రసాదించే పోలికను, సంఘంకొరకు క్రీస్తు దాచియుంచిన భవిష్యత్తును మనం చూడగలం. క్రైస్తవులుగా మనకున్న మేళ్లు, కోర్కెలు, మన బాధ్యతలు మన అవకాశాలను ఈ చిత్రం మన మనస్సుకు తెస్తుంది.

సంఘము క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెయై ఉండగా, సంఘ సభ్యుడుగా ఉండకుండ ఎవడు కోరుకుంటాడు? క్రీస్తుయొక్క పెండ్లి కుమార్తెగా ఉండడం ఎంతటి ధన్యత! క్రీస్తు శరీరంలో ప్రవేశించకుండ, క్రీస్తును అనుసరించుతున్నానని తలంచుకుంటున్నవారికి సంఘం యొక్క స్వభావం అర్థం కాలేదనే చెప్పాలి.

నీకు యిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టుకొనడానికి ఎవరో ఒకరు గొప్ప నిధి నీకిచ్చారనుకో. నీవు దాన్ని స్వీకరిస్తావా? *Reader's Digest* పది మిలియన్ల డాలర్ల స్వీప్ స్టేక్స్‌ను ఎవరైనా నిరాకరిస్తారని ఊహించగలరా? నీకు డబ్బే బహుకరించినట్లయితే, నీవు దాని

విషయంలో వ్యత్యాసంగా ఉంటావా? “పది మిలియన్ల డాలర్లా, సారి నాకు యింటరస్టే లేదు” అని నీవు అంటావా? జవాబు విదితమే. నీవు పొందే ధనం విషయంలో బహు ఉత్సాహంగా ఉంటావ్.

తన సంఘంలోనికి ప్రవేశించి, తన పెండ్లికుమార్తె ఉండుమనే క్రీస్తు ప్రభువు యొక్క ఆహ్వానం భూసంబంధమైన ఏ ధనముకంటెను, స్థానములకంటెను, ఉల్లాసముల కంటెను, మహిమకంటెను అధిగమించినదై ఉంటుంది. క్రీస్తుతో నిత్య బాంధవ్యంలో ప్రవేశించుమని అది నిన్ను ఆహ్వానిస్తుంది, నేడు నీకున్న సామర్థ్యంతో గ్రహించలేనంత అత్యధికంగా నిత్యత్వంలో నీకు అది ప్రసాదిస్తుంది.

“పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” అని వారితో చెప్పాడు. “... మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను” (అపొ. 2:38, 47).

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. పెండ్లికుమార్తె యొక్క సహజ లక్షణాలను పేర్కొనుము.
2. ప్రత్యేకించి ఏ క్రొత్త నిబంధన రచయిత సంఘాన్ని “క్రీస్తుయొక్క పెండ్లి కుమార్తె” అని సూచించాడు?
3. క్రీస్తుకు నమ్మకత్వంగా ఉండడమంటే ఏమి?
4. మన గుర్తింపును వివాహం ఎలా మార్చుతోంది?
5. మనం చేసే ఒప్పందాలలో వివాహం అన్నిటికంటె బలీయమైనదని నీవు అంటావా?
6. “లోబడియుండడం” అనే పదంయొక్క భావమేమి?
7. “నియంత పరిపూర్ణుడైతే, నియంతయొక్క పరిపాలన పరిపూర్ణమైనది” అనే ప్రతిపాదనను చర్చించుము. ఈ ప్రతిపాదనను క్రీస్తుకు వర్తింపజేయుము.
8. ఎఫెసీ. 5:22-33 ప్రకారం, భర్త తన భార్యను ఎలా ప్రేమించాలి?
9. క్రీస్తు తన సంఘానికి ఏమి ప్రసాదిస్తాడు?
10. క్రీస్తు సంఘానికి ఎట్టి భవిష్యత్తు ఉంది? ఈ భవిష్యత్తును నీ సొంత మాటలలో వర్ణించు.
11. సంఘము “క్రీస్తుయొక్క పెండ్లికుమార్తె”యని నీవు తలంచినప్పుడు నీ మనస్సుకు ఏ ప్రధానమైన గుణలక్షణం తడుతుంది?
12. తన సంఘానికి క్రీస్తు రక్షణను వాగ్దానం చేశాడా? మరి యింకా ఏ యితర సంఘానికైనా ఆయన రక్షణ వాగ్దానం చేశాడా?